

చెట్ల మధ్యలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్ భవనం



క్వార్టర్స్ మూడో అంతస్తులో రాగిచెట్లు మొలిచి శిథిల స్థితికి చేరిన దృశ్యం

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం

- నిరుపయోగంగా చీరాల బీఎస్ఎన్ఎల్ క్వార్టర్లు
- 4–జీ సేవలకు పరుగులు పెడుతున్న బీఎస్ఎన్ఎల్
- విపరీతంగా ధరలు పెంచిన ప్రైవేటు కంపెనీలు
- బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్న వినియోగదారులు

చీరాల రూరల్: ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ అంటేనే గొప్పగా చూసే వాళ్లం. ఎవరి ఇంట్లోనైనా ల్యాండ్ ఫోన్ ఉందంటే చాలు అబ్బో అనుకొనేవారు. అంతే కాకుండా గ్రామంలో ఎత్తైన టవర్ ఉంటే చాలు ఎవరిది ఆ ఇల్లు అని ప్రత్యేకంగా చూసేవాళ్లు. అలాంటి వెలుగు వెలిగిన బీఎస్ఎన్ఎల్ కాలక్రమేణా మరగున పడిపోయింది. ప్రైవేటు టెలికాం రంగసంస్థలకు పోటీ పడలేక వెనకబడిపోయింది. కాలం ఒకేలాగ ఉండదు కదా.. మళ్లీ బీఎస్ఎన్ఎల్‌కు మంచికాలం వచ్చింది. ప్రైవేటు రంగ టెలికాం సంస్థలు విపరీతంగా ధరలు పెండచడంతో పేద, మధ్యతరగతి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అందుకు తక్కువ రేట్లు కలిగిన బీఎస్ఎన్ఎల్ వైపు వినియోగదారులు చూస్తున్నారు. కొత్తకొత్త ఆఫర్లతో కష్టమర్లను ఆకర్షిస్తూ ఒకవైపు ప్రైవేటు సెల్యూలర్‌లు ముందుకు దూసుకుపోతుండగా మరోవైపు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ మాత్రం రోజురోజుకు తన ప్రాభవాన్ని కోల్పోతుంది. ప్రైవేటు సెల్యూలర్లతో పోటీపడి ఆఫర్లను అందించలేక, ప్రైవేటు సెల్యూలర్‌లు స్పీడుగా అందించే ఇంటర్‌నెట్ సౌకర్యాలను అందించలేక ఉన్న కష్టమర్లను పోగొట్టుకుంది. అలానే గతంలో ఎంతో సందడిగా ఉండే ఆయా బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు ప్రస్తుతం కష్టమర్లు లేక వెలవెలబోతున్నాయి. మరోవైపు ప్రైవేటు సెల్యూలర్లు మాత్రం కొత్తకొత్త ప్యాకేజిలతో (ఆఫర్ల) పాటు నాలుగైదేళ్ల క్రితమే 4–జీ, 5–జీ సేవలను అందిస్తు కష్టమర్లను ఆకర్షిస్తు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. ఎంతగా విస్తరిస్తున్నాయంటే కష్టమర్లకు అందుబాటులో ఉండేవిధంగా రోడ్లపై చిన్నచిన్న టెంట్లువేసి ఉచితం సిమ్‌కార్డులు, ఉచిత టాక్‌టైమ్ అందిస్తున్నాయి. అంతేకాక తక్కువ ధరలకు ప్యాకేజిలు అందిస్తూ ఉచితంగా ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాయి. దీంతో జనాలు ప్రైవేటు సెల్యూలర్ల వైపు మొగ్గుతున్నారు. ఒక ప్రైవేటు కంపెనీ నెలరోజుల పాటు వాయిస్ కాల్స్ మాట్లాడాలంటే రూ.250 చెల్లించాల్సి వస్తోంది. ఇది కేవలం 24 రోజులు, రోజుకు ఒక జీబీ డేటా మాత్రమే అందిస్తోంది.



చీరాల టెలిఫోన్ ఎక్స్ఛేంజి కార్యాలయం

ప్రాభవం కోల్పోతున్న చీరాల కార్యాలయం..

బీఎస్ఎన్ఎల్ చీరాల ప్రధాన కార్యాలయం సిబ్బంది లేక తన ప్రాభవాన్ని కోల్పోతుంది. గతంలో చీరాల డివిజన్‌గా ఉన్న సమయంలో కార్యాలయంలో డీఈతో పాటు ఇద్దరు ఇంజినీర్లు, కార్యాలయం సిబ్బంది అధిక సంఖ్యలో విధులు నిర్వహించేవారు. అంతేకాక ఉన్నతాధికారులు చీరాల కార్యాలయంలో వినియోగదారుల సమావేశాలు ఏర్పాటు చేసి సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేవారు. అటు సిబ్బంది ఇటు వినియోగదారులతో కార్యాలయం నిత్యం కళకళలాడుతుండేది. చీరాల డివిజన్ కింద చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, ఇంకొల్లు, అద్దంకి, కొరిశపాడు, జే.పంగులూరు, తాళ్లూరు, కురిచేడు మండలాలు ఉండేవి. గతంలో దర్శి కూడా సబ్ డివిజన్ కింద ఉండేది సిబ్బంది కొరత కారణంగా పొదిలి, మార్కాపురం, దర్శిలను చీరాల డివిజన్‌లో కలిపారు. చీరాల డివిజన్ పరిధిలో గతంలో 100 మంది సిబ్బంది పనిచేయగా ప్రస్తుతం 25 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన సిబ్బందిని బలవంతగా వీఆర్ఎస్‌తో విరమణ చేయించారు. గతంలో లాండ్ లైన్ ఫోన్‌లు వినియోగించుకునే కష్టమర్లకు 20 మంది లైన్‌మెన్‌లు సేవలందించేవారు. ప్రస్తుతం ఉన్న లైన్‌మెన్లలందరూ పదవి విరమణ పొందారు. వారి స్థానంలో కొత్తవారి ని చేయలేదు. ఉన్న లాండ్‌లైన్‌లను ఉన్నతాధికారులు మెయింట్‌నెన్స్ చేయలేక ఉన్న లాండ్‌లైన్ కనెక్షన్‌లన్నింటిని తొలగిస్తున్నారు. వాటి స్థానంలో ఫైబర్ కనెక్షన్‌లు, ఎయిర్ ఫైబర్ కనెక్షన్‌లు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రస్తుతం చీరాల డివిజన్ పరిధిలో ఫైబర్ కనెక్షన్‌లు, ఎయిర్ ఫైబర్ కనెక్షన్‌లు మూడు వేలు ఉన్నాయి. లాండ్‌లైన్ కనెక్షన్‌లు 600 ఉన్నాయి. ఈ కనెక్షన్‌లు కూడా క్రమంగా మార్చే పనిలో ఉన్నారు.

నిరుపయోగంగా బీఎస్ఎన్ఎల్ క్వార్టర్లు..

చీరాల డివిజన్ పరిధిలో ప్రజలకు సేవలందించేందుకు 1995లో ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు వెనుక పాపరాజుతోటలో టెలిఫోన్ ఎక్స్ఛేంజి భవనాలను నిర్మించారు. ఎంతోమంది సిబ్బందితో అప్పట్లో కార్యాలయం కళకళలాడుతుండేది. ఆ పక్కనే సిబ్బంది, ఇంజినీర్లు నివాసముండేందుకు మూడంతస్తుల్లో 8 క్వార్టర్లు నిర్మించారు. కానీ నాలుగైదేళ్లగా ఆయా క్వార్టర్లన్నీ సిబ్బందిలేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

> **4–జీ సేవలు అందుబాటులోకి తెస్తున్నాం.**
>
> 
>
> ఈ నెలాఖరులోపు అన్ని ప్రాంతాల్లో 4–జీ సేవలు అందుబాటులోకి తెస్తున్నాం. కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది చాలా వరకు తగ్గిపోయారు. అధికారులు, సిబ్బంది నివాసముండే క్వార్టర్స్ నాలుగేళ్లగా ఖాళీగా ఉన్నాయి. వాటినుంచి ఆదాయం రావాలాల్సి ఉండగా మేమే మున్సిపాలిటీకి వారికి పన్నుల రూపంలో నగదు చెల్లిస్తున్నాం. ఖాళీగా ఉన్న క్వార్టర్స్ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె చెల్లించి వినియోగించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
>
> – డీ రామప్రసాద్, డీఈ బీఎస్ఎన్ఎల్, చీరాల

అంతేకాక వాటి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో చుట్టు పక్కల పిచ్చి మొక్కలు మొలిచి పరిసరాలు అధ్వాన్నంగా ఉన్నాయి. భవనాలలో అమర్చిన పైపు లైన్లన్నీ ధ్వంసమయ్యాయి. భవనాలపై ఏపుగా రాగి చెట్లు మొలిచి భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఆయా క్వార్టర్స్‌పై ఆదాయం లేకపోగా ఏడాదికి రూ. 60,000 చొప్పున మున్సిపాలిటీకి పన్నుల రూపంలో నగదు చెల్లిస్తున్నారు.

నెలాఖరులోపు 4–జీసేవలు అందుబాటులోకి..

ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ తనపూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా అడుగులు వేస్తుంది. వాస్తవంగా ప్రైవేటు సెల్యూలర్‌లతో పోటీలుపడి బీఎస్ఎన్ఎల్ తన సేవలను విస్తరించే దిశగా కసరత్తులు చేస్తుంది. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న 3–జీ సేవలు స్థానంలో 4–జీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ప్రస్తుతం ఉన్న సెల్‌టవర్లతో పాటు మరికొన్ని కొత్త టవర్లు ఏర్పాటుచేసి 4–జీ యాంటెనాలు అమర్చుతున్నారు. ఆగస్టు నెలాఖరులోపు పనులు పూర్తిచేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయా కార్యాలయాల సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటికే బీఎస్ఎనల్ఎల్ సిమ్ కార్డులను వాడుతున్న కష్టమర్లకు 4–జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని మెజేజ్‌లు పంపుతున్నారు. సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలలో కానీ సంబంధిత ఫ్రాంచైజీలలో కానీ కష్టమర్లు ఈ నెలాఖరులోపు ఆధార్ కార్డులు అందజేయాలని సూచిస్తున్నారు. ఫైబర్ నెట్ కనెక్షన్‌లు, ఎయిర్ ఫైబర్ సేవలు మాత్రం వినియోగదారులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

వాడీవేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు లేకుండా వాటి నిర్వహణకు అనుమతులు ఎలా ఇస్తారని కొత్తపాలెం పంచాయతీ గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం మండల సమావేశ భవనంలో మండల అధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖలకు చెందిన అధికారులతో ఆయా శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అధికారులు వివరించారు. సమావేశంలో బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కొత్తపాలెం పంచాయతీలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండానే పాఠశాలను నిర్వహిస్తున్నారని, అటువంటి పాఠశాలకు అధికారులు అనుమతులు ఎలా ఇస్తున్నారంటూ ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా కొత్తపాలెం పంచాయతీలో జగనన్న హౌసింగ్ కాలనీకి సంబంధించి లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించి గృహ నిర్మాణాలు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మోటుపల్లి పంచాయతీ పరిధిలో గ్రామాల్లో తాగునీటికి అవసరమైన ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కొండూరు గోవింద్ కోరారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్ వేణుగోపాలకృష్ణమూర్తి, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులకు విరాళాల సేకరణ



నిధులు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జే.పంగులూరు: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం మంగళవారం సాయంత్రం పంగులూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. సుమారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు తలపనేని రామారావు, మండల నాయకులు గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడుతూ వయనాడ్‌లో కొండ చరియలు విరగడంతో విపరీతమైన వరద రావడం వల్ల వందలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వేలాది మంది గల్లంతయ్యారన్నారు. అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం విరాళాలు సేకరిస్తుందని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పూసపాటి సుబ్బరాజు, పాలపర్తి ప్రేమ కుమార్, వేమూరి సునందబాబు, పాణికొండ సుధాకర్ రావు, సరికొండ కృష్ణంరాజు, పాలపర్తి ఏలియా తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు పంట రుణాలు



సిబ్బందికి శిక్షణిస్తున్న ఏడీఏ మోహన్‌రావు

చినగంజాం (పర్చూరు): ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులందరికీ వ్యవసాయ పంట రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పర్చూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎస్ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పర్చూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో పర్చూరు సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల ఆర్బీకే సిబ్బందికి ఈ–క్రాప్ మీద శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బాపట్ల జిల్లా మాస్టర్ ట్రైనర్ వీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన ప్రతి పంటని ఈ–క్రాప్ నమోదు చేయాలని సూచించారు. ఈ పంటలో నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం, బీమా, పంట కొనుగోలు, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పథకాలు వస్తాయని చెప్పారు. సదస్సులో మండలం వ్యవసాయ శాఖ అధికారులు వేణుగోపాల్, ఆదినారాయణ, సుధీర్ బాబాబు, వ్యవసాయ అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

అణుబాంబులతో సర్వనాశనం



హిరోషిమా మృతులకు సంతాపం తెలుపుతున్న రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: అణుబాంబులున్న దేశాలన్నీ వాటిని నిర్వీర్యం చేయాలని అప్పుడు ప్రపంచశాంతి వర్ధిల్లుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ కార్యాలయంలో హిరోషిమా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆనాటి మృతులకు సంతాపాన్ని తెలుపుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రపంచే దేశాలన్ని శాంతి చర్చలు జరపాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, అళహరిహరిప్రసాద్, బీఎస్ పూర్ణచంద్రరావు, సీహెచ్ గురు శేఖర్, పీ ఆంజనేయులు, కొల్లా భువనేశ్వరీ పాల్గొన్నారు.

ఆయుష్‌శాఖ ఎస్టీ ప్రత్యేక నిధులతో మండలంలోని వల్లాపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, కీళ్లవాతం, నొప్పులు, స్కిన్ ఎలర్జీకి పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారులు సూచించారు. అంబడిపూడి కొణిదెన గ్రామాల్లోని ఆయుష్ వైద్యశాలల ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపులో అంబడిపూడి ఆయుష్ కాంపౌండర్ వీ. శేషసాయి పాల్గొన్నారు.

ఆయుర్వేదం ప్రజల జీవన వేదం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ఆయుర్వేద వైద్యం ప్రజల జీవన వేదమని దీర్ఘకాలిక వ్యాధులకు ఎలాంటి ప్రభావాలు లేకుండా నయం చేయవచ్చని దగ్గుబాడు ఆయుష్ వైద్యాధికారి పీ. కృష్ణకుమార్ అన్నారు.

విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

కారంచేడు: ఈనెల 8వ తేదీన జరగనున్న పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపించేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్ఎంల సమావేశంలో మాట్లాడారు. ఈఎన్నికల నిర్వహణలో హెచ్ఎంలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొదట ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకోవాలన్నారు. ఈముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండాలన్నారు. ఆతరువాత చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఎం వెంకటేశ్వర్లు, స్వర్ణ, కొడవలివారిపాలెం, కుంకలమర్రు పాఠశాలల హెచ్ఎంలు ఎంవీ సుబ్బారావు, ఏ ఉమామహేశ్వరరావు, పద్మావతి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారి స్వాతి కిరణ్

వేటపాలెం: గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు ఎప్పుడు అందుబాటులో ఉండాలని వైద్యాధికారి సాయికిరణ్ అన్నారు. స్థానిక ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తల్లీబిడ్డలకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించాలని, పిల్లలకు సకాంలో వ్యాధిని రోదక టీకాలు వేయిం చాలన్నారు. డాక్టర్ సాయి వైష్ణవి మాట్లాడుతూ గర్భిణులకు సలహాలు, వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గురవమ్మ, సహెచ్ఎం యూనిట్ అధికారి శేషుబాబు, సూపర్‌వైజర్ మార్తమ్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీరాల టౌన్: వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. మంగళవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామంలోని 21 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఆలయాల్లో శ్రావణమాసం పూజలు



అలంకరణలో అమ్మవారు

బల్లికురవ: శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు చేపట్టారు. కొత్తపాలెం కోదండ రామాలయం చెన్నుపల్లి కొండాయలపాలెం గ్రామాల్లో కోదండ రామాలయాలు, శివాలయాలు, చిన అంబడిపూడి శివాలయం కొమ్మినేని వారిపాలెం గ్రామంలోని కోదండ రామాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు చేపట్టారు. మహిళలు వేడుకల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ–క్రాప్‌తో రైతులకు ఉపయోగాలు



జనవరంలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి



కొప్పరపాలెం గ్రామంలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న ఏవో

జే.పంగులూరు: ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని.. తద్వారా రైతులు ప్రకృతి విపత్తుల వలన నష్టం వాటిల్లితే రైతులకు నష్టపరిహారం అందిస్తారని తెలిపారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌కుగాను మంగళవారం రైతు భరోసా కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టారు. జనకవరం జరుగుతున్న నమోదు కార్యక్రమానికి ఏవో సుబ్బారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారి నవనీత, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును ఏవో కుమారి పరిశీలించారు. కౌలు రైతులు కూడా నమోదు చేయించుకోవాలని, విపత్కర పరిస్థితుల్లో పరిహారంతోపాటు పంట ఉత్పత్తులను అమ్ముకోవటం, ఇన్‌పుట్ సబ్సీడీలు పొందవచ్చని ఏవో కుమారి వివరించారు.

డిపో మేనేజర్ నిరంకుశ వైఖరిని విడనాడాలి



ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఈయూ ఉద్యోగులు

చీరాల అర్బన్: ఆర్టీసీ డిపో చీరాల మేనేజర్ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నారంటూ ఆ యూనియన్ ఉద్యోగులు మంగళవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డిపో అధ్యక్షులు కాల్వ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి అనధికారకంగా ఒక యూనియన్ ఉద్యోగులను ఓడీలుగా వాడుకుంటూ సభ్యుల పట్ల పక్షపాతధోరణి అవలంభిస్తున్నారన్నారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా దాటవేస్తున్నారన్నారు.తమ సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మచ్చా శ్రీనివాసరావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కారంచేడు: గ్రామ దేవత, పోతిన వారి ఆరాధ్యదైవం అక్కమాంబకు రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి మండలంలోని పోతినవారిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు, పోతిన వెంకట్రావు, పోతిన నాగేశ్వరరావు, పోతిన మస్తాన్‌రావు, పోతిన లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతోను, నియమనిష్ఠలతోను పెద్ద ఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారిని గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో గుంటూరు జిల్లా కాకుమాను, కొండపాటూరు, కారంచేడు, పోతినవారిపాలెం గ్రామాల్లోని పోతిన వారి వంశీకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వారి ఆరాధ్యదైవానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు ఆచరించారు. అనంతరం సుమారు 2 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



గ్రామోత్సవంలో భక్తులు

క్లుప్తంగా

నీళ్ల మోటార్ బహూకరణ



మోటారు అందజేస్తున్న రాజా సాల్మన్

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవనాల సముదాయంలోని ఆవరణలో గార్డెన్‌కు నీటిని సరఫరా చేసే నిమిత్తం నీళ్ల మోటార్‌ను బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరి ఎ. రాజా సాల్మన్ మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబుకు బార్ అసోసియేషన్ హాలులో అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి కోర్టు ప్రాంగణంలో సుందరమైన గార్డెన్, పచ్చదనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన నీళ్ల మోటార్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం



వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు వినతిపత్రాలను అందించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతుల వరకు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. హైస్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. హైస్కూళ్లలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలన్నారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన పథకం మెనూను సవరించాలన్నారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. డిమాండ్లపై వినతిపత్రాలను ఎంఈఓ, తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులకు అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు భిక్షాలుబాబు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.సురేష్, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు పి.సీతా రామరాజు, సీనియర్ నాయకులు సూరిబాబు, ఎయిడెడ్ కన్వీనర్ శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.